క్లుప్తంగా

పనుల పరిశీలన



ఐనన్‌పల్లిలో పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని ఐనన్‌పల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో నిర్మిస్తున్న శివాలయ పనులను త్వరగా పూర్తి చేయించాలని గ్రామస్తులకు సూచించారు. మండల పరిధిలోని ఖాజా అహ్మద్‌పల్లి గ్రామంలో కొత్తగా మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు మునీర్, శ్రీకాంత్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్, సీట్‌బెల్టు తప్పనిసరి

ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్



వాహనదారులకు అవగాహన ర్యాలీలో పోలీసులు

ధారూరు: వాహనదారులు విధిగా హెల్మెట్, సీట్‌బెల్టు ధరించాలని ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాహన డ్రైవర్లతో బస్టాండు నుంచి మసీదు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బైక్‌లపై ట్రిబుల్ రైడింగ్ చేయొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతిఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని ఆయన సూచించారు. లేని పక్షంలో మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్‌ఐ సంగమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

30న బహిరంగ వేలం



ఎల్లమ్మదేవి మూల విరాట్

దుద్యాల్: మండల పరిధిలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవత బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 30న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 20నుంచి మార్చి 7 వరకు, మార్చి 8 నుంచి సంవత్సరం మొత్తం దేవాలయం దగ్గర టెంకాయలు, లడ్డు, పులిహోర అమ్ముకోవడానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నమన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు. వేలం పాటకు సంబంధించిన నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు.
పూర్తి వివరాలకు ఎల్లమ్మ దేవస్థానం మేనేజర్ 9010729852ను సంప్రదించొచ్చని తెలిపారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



నేతాజీ నాటక ప్రదర్శనలో విద్యార్థులు

తాండూరు టౌన్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని శుక్రవారం పట్టణంలోని శ్రీనేతాజీ గురుదేవ్ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సుభాష్ చంద్రబోస్ బ్రిటీష్ వారితో చేసిన పోరాటంపై నాటక ప్రదర్శన ఇచ్చారు. పలు రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలతో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మణిమాల మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలను నేర్పిస్తున్నామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బొంరాస్‌పేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓ హరిలాల్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలు, వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనంలో విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. విజేతలను ఎంఈఓ హరిలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతా మట్టే!



రోడ్డుపై వేసిన కంకర, మట్టి కుప్ప

- పేరుకే బీటీ రోడ్డు
- ఇష్టారాజ్యంగా పనులు
- పట్టించుకోని అధికారులు

బొంరాస్‌పేట: ఏడాది క్రితం.. మండల పరిధిలోని రేగడిమైలారం నుంచి మూడుమామిళ్ల తండా మీదుగా భీక్యానాయక్ తండా వరకు 2.4కిలో మీటర్ల బీటీ రోడ్డు ప్రారంభించారు. రైతుల అభ్యంతరాల వల్ల పనులు కాస్త ఆలస్యంగా నిర్వహిస్తున్నారు. దీన్ని అదునుగా భావించి కాంట్రాక్టర్, ఆర్ అండ్ బీ అధికారులు ఇష్టారాజ్యాంగా పనులు చేస్తున్నారని స్థానికులు, ఆయా తండాల వాసులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలకు తావులేకుండా మలుపుల వద్ద కల్వర్టు నిర్మించాలి. కానీ అశ్రద్ధగా నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం పటేల్‌చెరువు కట్టకింద ఓ లారీకి తృటిలో ప్రమాదం తప్పింది. అక్కడ పనుల్లో నాణ్యమైన కంకర, మట్టి వాడటం లేదని స్థానికులు చెబుతున్నారు. కంకర పనుల్లో ఎక్కువగా మట్టినే వాడుతున్నారని తెలుస్తుంది. రోడ్డు పనులు మాత్రం నాసిరకంగా కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనసాగుతన్న పనులను పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించేవిధంగా కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని తండావాసులు చెబుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ మహేశ్‌ను వివరణ కోరగా వెళ్లి పర్యవేక్షిస్తామని చెప్పారన్నారు. రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించేలా తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు

మర్పల్లి మార్కెటు కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు మర్పల్లి మార్కెటు కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రాచిట్టంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యమన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో మండలానికి రూ.5.04కోట్లతో ఎన్‌ఆర్‌ఇజీఎస్ నిధులు మంజూరు చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీహామీని సీఎం రేవంత్ రెడ్డి విడతల వారీగా అమలు చేస్తున్నారన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రజలకు సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుభాష్, మహంత్‌స్వామి, సర్దార్‌నాయక్, మానునాయక్, మోహన్, జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

పరిగి డీఎం కరుణశ్రీ



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎం, డ్రైవర్లు, సిబ్బంది

పరిగి: డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని పరిగి డీఎం కరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం పరిగి ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీకి డ్రైవర్లు వెన్నుముకని చెప్పారు. ఇంధనాన్ని పొదుపు చేస్తూ, బస్సునిండా ప్రయాణికులను తీసుకెళ్తే సంస్థకు ఆదాయం సమకూరుతుందన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రమాదాలను సున్న శాతానికి తీసుకురావాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. వాహనదారులు, డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు.

పేరుకే మున్సిపాలిటీ..!

- అభివృద్ధికి ఆమడ దూరం
- వార్డు సభల్లో అధికారులను ప్రశ్నించిన తండావాసులు



అధికారులను ప్రశ్నిస్తున్న తండావాసులు

పరిగి: తండా పేరుకే మున్సిపాలిటీ. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తండా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంటుంది. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పదోవార్డు కిష్టమ్మగుళ్ల తండాలో ప్రజాపాలన వార్డుసభ నిర్వహించారు. ఈ సభలో తండావాసులు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి సంవత్సరం గడుస్తున్నా అభివృద్ధిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తండా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అందేలా అర్హులను గుర్తించేందుకు ఈ సభలు అని అధికారులు ప్రజాప్రతినిధులు సమాధానమిచ్చారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పూడూరు: ప్రతిఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ కార్యదర్శి అజీంపటేల్ పేర్కొన్నారు. శుక్రవారం ఎన్కేపల్లిలో స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, సాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో మన్నేగుడ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీంపటేల్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జగదీశ్, రాకేశ్, వినీత, సిమ్రాన్, ఆస్పత్రి పీఆర్‌ఓ రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు సుజాత, శ్రీనివాసులు, నాగేశ్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు

పరిగి జూనియర్ సివిల్ జడ్జి శిల్ప



పరిగి: మాట్లాడుతున్న జడ్జి శిల్ప

పరిగి: ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగని, భవిష్యత్‌లో రాణించి కీర్తిని తీసుకొస్తారని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప సూచించారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో అంకిత స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను చిన్నచూపు చూడొద్దన్నారు. వారిని ప్రోత్సహించి చదివిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఆడపిల్ల పుడితే భారం అనుకోవద్దని మంచి భవిష్యత్ అందించాలన్నారు. ఆడపిల్లలను చదివిస్తే వారు ఉన్నత స్థానంలో ఎదిగి దేశానికి సేవలు అందిస్తారన్నారు. కావున పిల్లలకు చిన్నతనంలో పెళ్లీలు చే యొద్దని సూచించారు. అంకిత స్వచ్ఛందసంస్థ కో ఆర్డినేటర్ ప్రకాశ్, లీగల్ సెల్ కౌన్సిల్ గౌస్‌పాషా, న్యాయవాదులు శివారెడ్డి, వెంకటేశ్, మోహన్, పాల్గొన్నారు.
అనంతగిరి: వికారాబాద్‌లో యంవీ ఫౌండేషన్, తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వభారతి కళాశాలలో బాలికలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీడీపీఓ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ అమ్మాయిలు బాగా చదువుకోవాలని, విద్యతోనే అన్ని సాధ్యమన్నారు. డీసీపీఓ శ్రీకాంత్, ప్రభుత్వ జూనియర్ క ళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, యంవీఎఫ్ ప్ర తినిధులు శ్రీనివాస్, ఆశాలత, ఉమా మహిళ శిశు సంక్షేమ శాఖ జెండర్ విభాగం ప్రతినిధులు వరలక్ష్మి, రాందాసు, బాబు సమాఖ్య నాయకులు కృప పాల్గొన్నారు.
కుల్కచర్ల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి దేవి మాట్లాడుతూ... బాలికల సంరక్షణ, వారి విద్య, సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. చౌడాపూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారి జ్యోతి పాల్గొన్నారు.

అలహాబాద్ హైకోర్టు జడ్జిని కలిసిన తాండూరు మేజిస్ట్రేట్



అలహాబాద్ హైకోర్టు జడ్జితో శివలీల

తాండూరు రూరల్: అలహాబాద్ హైకోర్టు జడ్జి వినోద్ దివాకర్‌ను తాండూరు మేజిస్ట్రేట్ శివలీల మర్యాద పూర్వకంగా కలిసారు. శుక్రవారం తాండూరు మండలం జినుగుర్తి గ్రామ శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

బ్యాంక్ అకౌంట్‌లో మార్పులు చేసుకోవచ్చు

తాండూరు రూరల్: రైతు భరోసా పథకం కింద రైతులకు సంబంధించి బ్యాంక్ అకౌంట్ నెంబర్‌ను మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని వ్యవసాయ శాఖ తాండూరు ఏడీ రుద్రమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా 2025, జనవరి 1 నాటికి కొత్త పాసు పుస్తకం తీసుకున్న రైతులు కూడా రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు యూత్ ఫర్‌సేవ కార్యక్రమాలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందార్‌పూర్ ఉన్నత పాఠశాలలో యూత్ ఫర్ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారని హెచ్‌ఎం రామయ్య తెలిపారు. యూత్ ఫర్ సేవ అనే సంస్థ నుంచి పాఠశాలకు ఉచితంగా రూ.60వేల ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు, డిజిటల్ టీవీ, జారుడుబల్లా, ఉయ్యాల, తదితర సామగ్రిని పాఠశాలలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ప్రారంభోత్సవానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, సతీశ్, హాజరు కానున్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

తాండూరు రూరల్: తాండూరు మండల బీఆర్‌ఎస్ నాయకుల సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు సిరిగిరిపేట్ వీరేంధర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



ఆంజనేయులును సన్మానిస్తున్న ధాన్యం కొనుగోలుదారులు

కుల్కచర్ల: రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుదారులు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్ కమిటీని అభివృద్ధిచేసేందుకు కృషి చేస్తానన్నారు. రైతులకు లాభదాయకంగా ఉండే వ్యాపారాన్నే ప్రోత్సహిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారులందరూ కమిషన్ ఏజెంట్లుగా, ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రాజు, బుగ్గమ్మ, ధాన్యం కొనుగోలుదారులు సత్యం, ప్రసన్న, రమేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా నిత్యాన్నదాన భవన నిర్మాణ పనులు



పనులు కొనసాగుతున్న నిత్యాన్నదాన సత్రం

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ప్రసిద్ధ భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏడాది పొడవునా భక్తులకు అన్నదానం చేయాలనే ఉద్దేశ్యంతో ఆలయ కమిటీ చర్యలు తీసుకుంది. దీంతో 45 రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో దేవస్థాన కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్ కుమార్ అన్నదాన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొత్తం భవన నిర్మాణానికి సుమారు రూ. కోటి వరకు ఖర్చవుతుందని, ఇందుకు దాతలు సహకరించాలని ఆలయ చైర్మన్ పటేల్ కిరణ్ కుమార్ కోరారు. గతంలో దేవాలయ ఆవరణలో వందలాది మంది భక్తులకు నిత్యాన్నదానం నిర్వహించామని గుర్తు చేశారు. అయితే ఇదే ఆనవాయితీని ఆరు నెలల క్రితం ప్రారంభించామన్నారు. ప్రస్తుతం వీరశైవ యువదళ్ నేతృత్వంలో ఆలయంలో నిత్యం 300మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.

పేద విద్యార్థుల ఉన్నతికి సహకారం



విద్యార్థులకు వైట్ డ్రెస్సులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు

కుల్కచర్ల: పేద విద్యార్థుల ఉన్నతికి ప్రతిఒక్కరూ సహకరించాలని షాద్‌నగర్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎలుకుర్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఇప్పాయిపల్లి గ్రామంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులకు వైట్ అండ్ వైట్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నతికి తమ సంఘం ఆధ్వర్యంలో కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పాయిపల్లి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య, వాసవీ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి నవీన్, కోశాధికారి గుబ్బ సురేశ్, సభ్యులు సూరిశెట్టి నర్సింలు గుప్తా, శ్రీనివాసులు, పెద్ది రామ్మోహన్, వెంకటరమణ, విజయ్‌కుమార్, యం శ్రీనివాసులు, రాఘవేందర్, ఆనంద్, శంకర్, నీల రాఘవేందర్, బాలచంద్రయ్య, సరిత, రుక్మిణి, శివశంకర్, శ్యాంసుందర్, యాదయ్య, మహమూద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి



శిరీష

యాలాల: యాసంగి పెట్టుబడి కోసం కొత్తగా పట్టాపాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని రాస్నం క్లస్టర్ ఏఈఓ శిరీష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025, జనవరి1వరకు కొత్తగా పట్టా పాసుపుస్తకాలు తీసుకున్న రైతులు దరఖాస్తుకు అర్హులన్నారు. రైతు భరోసా కోసం పట్టాదారు పాసుపుస్తకం లేదా డిజిటల్ సంతకంతో పూర్తయిన డాక్యుమెంట్లు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ ప్రతులను దరఖాస్తు ఫారానికి జతచేయాలన్నారు. వీటితో పాటు గతంలో పెట్టుబడి సాయం పొందిన రైతులు బ్యాంకు ఖాతాల మార్పు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

పలకల పంపిణీ

కొడంగల్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మానాన్న ఫౌండేషన్ నిర్వాహకులు ప్రవీణ్ కుమార్ శుక్రవారం పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని పేర్కొన్నారు. వారి విద్యాభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలన్నారు.

గ్రామ సభలతో లబ్ధి

- అర్హులను గుర్తించడమే లక్ష్యం
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు
- ముగిసిన సభలు



బొంరాస్‌పేట: బాపన్‌చెర్వు తండాలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న వెంకన్నగౌడ్

బొంరాస్‌పేట: గ్రామ సభలతో ప్రభుత్వ పథకాలకు అర్హులు లబ్ధిపొందొచ్చని ఎంపీడీఓ వెంకన్నగౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాపన్‌చెర్వుతండా, బాపల్లి తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేకాధికారులు ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్, ఏడీఏ శంకర్‌రాథోడ్, ఎంపీడీఓ వెంకన్నగౌడ్ పాల్గొని మాట్లాడారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, మోత్యానాయక్, సంతోశ్ పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: ప్రజాపాలన గ్రామ సభలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు బంట్వారం మండలంలోని బొప్పునారం, రొంపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆయా వివరాలను ప్రజలకు వివరించారు. అర్హుల జాబితాను సభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, ఈజీఎస్ టీఏ అశోక్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో..

కోట్‌పల్లి మండలంలోని ఎన్నారం, ఎన్కెపల్లి గ్రామాల్లో నిర్వహించారు. అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీఓ ఎలీషా పాల్గొన్నారు.
దోమ: సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ మంజూరు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, డైరెక్టర్ శాంతుకుమార్ పేర్కొన్నారు. ఖమ్మంనాచారం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఏపీఓ దస్తయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, మాజీ సర్పంచ్ వెంకటనర్సమ్మ, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, పాల్గొన్నారు.
కొడంగల్: కొడంగల్ మండల పరిధిలో నిర్వహిస్తున్న గ్రామ సభలు ముగిశాయి. చిట్లపల్లి, హస్నాబాద్, పెద్దనందిగామ, టేకుల్‌కోడ్‌లో ఈ సభలను నిర్వహించారు.



బంట్వారంలో..



దోమ: మాట్లాడుతున్న శాంతుకుమార్